పారిశుద్ధ్య పనులకే పరిమితం!

- మిర్యాలగూడలో మొక్కుబడిగా వంద రోజుల ప్రణాళిక
- మిగతా అంశాలపై దృష్టిపెట్టని మున్సిపల్ సిబ్బంది
- కొత్తగా స్వయం సహాయక సంఘాల ఏర్పాటే లేదు
- ఇంకుడు గుంతల నిర్మాణాలపై కల్పించని అవగాహన



ప్రకాశ్‌నగర్‌లో వంద రోజుల ప్రణాళికలో పాల్గొన్న మున్సిపల్ సిబ్బంది

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీలో చేపట్టిన వంద రోజుల ప్రణాళిక అమలు కేవలం పారిశుద్ధ్యం పనులకే పరిమితమైంది. 'ఒక చర్య–ఒక మార్పు' అనే నినాదంతో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం రోజైన జూన్ 2న ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ శాఖ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. ఈ వంద రోజుల ప్రణాళికల సెప్టెంబర్ 10వ తేదీ వరకు కొనసాగనుంది. వంద రోజుల ప్రణాళికలో 50 అంశాలను చేర్చింది. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో పారిశుద్ధ్యానికే ప్రాధాన్యమిస్తూ మిగతా అంశాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు.

పరిసరాల శుభ్రతపైనే దృష్టి..

మున్సిపాలిటీలో పారిశుద్ధ్య పనులపైనే ప్రధానంగా దృష్టిని సారించారు. వర్షపునీరు సక్రమంగా ప్రవహించేలా చెత్తాచెదారం, మురుగు, వరద కాలువల్లో పూడికతీత తొలగించడం, రద్దీ ప్రాంతాల్లో నివాస గృహాల దగ్గర పరిసరాలు శుభ్రంగా ఉంచుకునేలా మైకుల ద్వారా ప్రచారం చేస్తున్నారు. తడి, పొడి చెత్తను వేరు చేయడం, పరిశుభ్రత, మన వ్యర్థాల నిర్వహణపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. దోమలతో వచ్చే విష జ్వరాలను వివరిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పూర్తిస్థాయిలో వివరిస్తున్నారు. లార్వా పెరగకుండా నిల్వ ఉంటున్న నీటిలో ఆయిల్ బాల్స్‌ల తోపాటు తదితర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుతున్నారు. దీనికితోడు ఆదాయాన్ని పెంచుకునేందుకు భవనాల కొలతలు, పన్ను మదింపు, ట్రేడ్ లైసెన్స్, నల్లా బిల్లులు వసూలు మాత్రమే రెవెన్యూ అధికారులు చేపడుతున్నారు. మున్సిపల్ ఆదాయం పెంచేందుకు భవనాల కొలతలు, పన్ను మదింపు, ట్రేడ్ లైసెన్స్, నల్లా బిల్లులు వసూలు మాత్రమే రెవెన్యూ అధికారులు చేపడుతున్నారు.

ఈ అంశాల అమలు అంతంత మాత్రమే..

- ఒకేసారి వాడిపడేసిన ప్లాస్టిక్ వస్తువులను తగ్గించేందుకు స్వశక్తి సంఘాల సభ్యులకు బర్తన్ బ్యాంకులను ప్రోత్సహించి అందించాల్సి ఉండగా అక్కడక్కడా మాత్రమే చేపడుతున్నారు
- వీధి వ్యాపారుల కోసం ప్రత్యేకంగా వెండింగ్ జోన్‌ను ఏర్పాటు చేయడం లేదు.
- మెప్మా ద్వారా కొత్త స్వయం సహాయక, వీధి వ్యాపారులతో కొత్త సంఘాలను ఏర్పాటు చేయడం, బ్యాంకు లింకేజి రుణాలను ఇప్పించడం వంటి కార్యక్రమాలు ఆశించిన స్థాయిలో జరగడం లేదు.
- ప్రధాన కూడళ్లలో సుందరీకరణ, ఇంకుడు గుంతల వంటి నిర్మాణాలపై దృష్టిని సారించడం లేదు.
- లీకేజీలు అధికంగా ఉండగా క్లోరినేషన్ తనిఖీలు కొనసాగడం లేదు.
- వర్షాల సమయంలో శిథిల భవనాలను తొలగింపుపై నోటీసులు ఇచ్చి ఆ తరువాత పట్టణ ప్రణాళిక విభాగం అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు.

మహాధర్నాను విజయవంతం చేయాలి



హాలియాలో పీఆర్‌టీయూ నాయకులతో ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి

- ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి

హాలియా : పీఆర్‌టీయూ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని నల్లగొండ–వరంగల్–ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నాగార్జునసాగర్ ప్రాంతాన్ని సందర్శించిన ఆయన హాలియా పట్టణంలో షిర్డీ సాయిబాబా మందిరాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సాగర్ నియోజకవర్గ పీఆర్‌టీయూ నాయకులు ఎమ్మెల్సీకి ఘన స్వాగతం పలికారు. ఆలయ కమిటీ చైర్మన్ తేలపోలు శేఖర్, సక్రునాయక్, వజ్రతేజ రైస్ మిల్లు చైర్మన్ చిట్టిపోలు యాదగిరిలు ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డికి సాయిబాబా వెండి ప్రతిమను బహూకరించి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాశం నారాయణరెడ్డి, మేకల జానారెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణా సంఘం చైర్మన్ కోమటిరెడ్డి నరసింహారెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షుడు సుంకరి భిక్షంగౌడ్, పత్రిక సంపాదకులు గాదె వెంకట్‌రెడ్డి, అనుముల, తిరుమలగిరి మండలాల ఎంఈఓలు కృష్ణమూర్తి, శ్రీనివాస్, ఆ సంఘం వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు మంచికంటి మధు, చెన్ను వెంకట్‌రెడ్డి, పాపిరెడ్డి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి వినతుల వెల్లువ..

పెద్దవూర : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు శనివారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డికి వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము సీఆర్‌టీ, రెగ్యులర్ టీచర్లతో సమానమైన విధులు నిర్వహిస్తున్నామని, కానీ కేవలం రూ.12వేల వేతనం మాత్రమే ఇస్తూ వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని తెలిపారు. తమకు ఇదే శాఖలో పనిచేస్తున్న సీఆర్‌టీలతో సమాన వేతనం ఇప్పించాలని కోరారు. మినిమం టైం స్కేల్ వేతనం ఇప్పించాలని కేజీబీవీలలో పనిచేసే ఉపాధ్యాయులు విన్నవించారు. సమస్యలు పరిష్కరించాలని సీఆర్‌పీలు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాలల అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.సురేందర్, ఎండీ.షబ్బీర్, సైదులు, సంధ్య, శాంతి, రాంరెడ్డి, సీఆర్‌పీలు వెంకటయ్య, దుబ్బ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మౌలిక వసతులు కల్పించాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నేతలు

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పించాలని కోరుతూ శనివారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు బీజేపీ టూ టౌన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. హనుమాన్‌పేట ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి రైల్వే ట్రాక్ వరకు రాత్రిపూట లైట్లు వెలగడం లేదని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు పెద్దబోయిన వెంకటరమణ యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు, రేపాల పురుషోత్తంరెడ్డి, బంటు సైదులు, కనపర్తి సత్యప్రసాద్, సజ్జల నాగిరెడ్డి, తుమ్మలపల్లి హనుమంతరెడ్డి, లక్ష్మారెడ్డి, రమేష్, రాంప్రసాద్, నిరంజన్‌రెడ్డి, నందికొండ హరిప్రసాద్, వేణు, చిలుకూరి శ్యాం, నవీన్, సైదులు, శేఖర్, సోమలింగం, బాషా, సృజన తదితరులున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

త్రిపురారం : హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని త్రిపురారం మండల ప్రత్యేక అధికారి లీలా అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రాజీవ్‌కాలనీలోని ఎస్టీ మినీ గురుకులాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మెనూను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ రమావత్ రవి, ప్రధానోపాధ్యాయులు భారతి, సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శిగా రవి



రవి

పెద్దవూర : పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శిగా మండలంలోని బెట్టెలతండా ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు పి.రవి నియామకమయ్యారు. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాలం నారాయణరెడ్డి, మేకల జానారెడ్డి నియామకపత్రాన్ని అందించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇరుమాది పాపిరెడ్డి, దుర్గాప్రసాద్, గౌరవ అధ్యక్షుడు దండ వీరారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వడ్లపల్లి వెంకటేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వెల్ఫేర్ అసోసియేసన్ ఉపాధ్యక్షుడిగా సమీర్



అబ్దుల్ సమీర్

మిర్యాలగూడ : భారతదేశ రక్షణ దళాల్లో 17 సంవత్సరాలు విశేష సేవలు అందించి పదవీ విరమణ పొందిన మిర్యాలగూడకు చెందిన మహమ్మద్ అబ్దుల్ సమీర్ జిల్లా ఎక్స్ సర్వీస్ మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం నిర్వహించిన నల్లగొండ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా సమీర్ మాట్లాడుతూ మాజీ సైనికుల సమస్యలు, వారి కుటుంబాల అభివృద్ధి, ప్రభుత్వ పథకాలు అందరికీ చేరే విధంగా కృషి చేస్తానన్నారు. అనంతరం మాజీ సైనికులు సమీర్‌ను ఘనంగా సన్మానించారు.

మూసా ఆలీఖాన్‌కు సన్మానం

మిర్యాలగూడ టౌన్ : పట్టణానికి చెందిన సామాజిక వేత్త, నటుడు, నిర్మాత మూసా ఆలీఖాన్‌నేషనల్ ప్రామినేన్స్ అవార్డు –2025కు ఎంపికైన సందర్భంగా బంజారా ప్రసాద్ ల్యాబ్‌లో శుక్రవారం ఘనంగా సన్మానించారు. తెలంగాణ డిప్యూటీ స్పీకర్ జాటోత్ రామ్ చందర్‌నాయక్, అక్షర డైమాండ్ అండ్ జువెలర్స్ ఫౌండర్ అండ్ చైర్మన్ స్పెషల్ గెస్ట్ శ్రీకోటా కుమార్, టీఎఫ్‌ఐ డైరెక్టర్, సినీ దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్ చేతుల మీదుగా సన్మానంతో పాటు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా మూసా ఆలీఖాన్ మాట్లాడారు. కళాకారులకు కావాల్సిన సహకారాలను అందించేందుకు తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు.

బీటీ రోడ్లు నిర్మించాలి

మాడుగులపల్లి : మండల కేంద్రానికి అనుసంధానం చేస్తూ ప్రభుత్వం బీటీ రోడ్లను వెంటనే నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని గజలాపురం, అభంగాపురం గ్రామాలను పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అశోక్‌రెడ్డి, శ్రీకర్, మమత, వెంకటాచారి, నాగయ్య, నారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మిర్యాలగూడ మండలం సుబ్బారెడ్డిగూడెం గ్రామానికి చెందిన తెల్లబోయిన రాములమ్మకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అందజేశారు. ఇప్పటికే అనేక మంది పేదలకు నియోజకవర్గంలో సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబ్బారెడ్డిగూడెం గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షులు గుండ్రెడ్డి బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

దేవరకొండ : జాతీయ కుటుంబ ప్రయోజన పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో జాతీయ కుటుంబ ప్రయోజన పథకంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకం కింద దారిద్ర్య రేఖకు దిగువనున్న ప్రాథమిక ఆదాయం కలిగిన 18 నుంచి 59 ఏళ్ల వయస్సుగల మహిళలు, పురుషులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సహజ లేదా ప్రమాదవశాత్తు మరణిస్తే ఒకేసారి ఆ కుటుంబానికి రూ.20 వేల వరకు అందుతుందని తెలిపారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనకు దివ్యాంగులకు శిక్షణ



దివ్యాంగులకు పత్రాలకు అందజేస్తున్న ఎంపీడీఓ

మిర్యాలగూడ అర్బన్ : మండల సమాఖ్య కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పనపై డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శేషగిరి శర్మ మాట్లాడుతూ డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న స్వయం ఉపాధి కల్పన శిక్షణతో దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. దివ్యాంగులు ఎవరిపై ఆధారపడకుండా స్వయంగా తమ వ్యాపారాన్ని తామే చేసుకునే విధంగా దోహదం చేస్తుందన్నారు. వివిధ గ్రామాల నుంచి అర్హులైన 16మంది దివ్యాంగ అభ్యర్థులను ఎంపిక చేసి వారు వ్యాపారాలు చేసుకుంటూ అభివృద్ధి చెందేందుకు ఒక్కొక్కరికి రూ.25వేల విలువ చేసే కుట్టు మిషన్లు, పిండి మిల్లులు, మరికొన్ని యూనిట్లు అందించదగిన విషయమన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు బెనిఫిషరీ యూనిట్ గ్రాండ్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర రెడ్డీస్ ఫౌండేషన డైరెక్టర్ పీఎస్.శ్రీనివాస్, డీపీఎం రామలింగయ్య, సీడీపీఓ మమత, ఏపీఎం దిలీప్‌కుమార్, సాయి , ఓం ప్రకాశ్, మహేష్, మణికంత, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం హర్షణీయం

మిర్యాలగూడ అర్బన్: నేత్రాలను దానం చేయడం గొప్ప విషయమని నేత్ర దానంతో మరొకరికి చూపునిచ్చిన వారవుతారని మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురానికి చెందిన గొల్ల ధనమ్మ మృతిచెందడంతో కుటుంబ సభ్యుల అనుమతితో వాసవిక్లబ్ డైమాండ్ సభ్యులు మృతురాలి నేత్రాలను సేకరించి ఖమ్మం నేత్రనిధికి అందజేశారు. ధనమ్మ పార్థీవదేహం వద్ద విజయసింహారెడ్డి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ ప్రెసిడెంట్ రామలింగయ్య, డిస్ట్రిక్ ఇన్‌చార్జి సోమా శ్రీనివాస్, ఆర్గాన్ డొనేషన్ చైర్మన్ మిట్టపల్లి విజయ భాస్కర్‌రావు గొల్ల ప్రసాద్, గుడిపాటి నవీన్, చిట్టిబాబు నాయక్ పాల్గొన్నారు.

భూభారతి దరఖాస్తులు పరిశీలిస్తున్నాం



మాట్లాడుతున్న ఆర్డీవో రమణారెడ్డి

చందంపేట : భూ భారతి రెవెన్యూ సదస్సులలో రైతులు చేసుకున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, సర్వే చేపట్టి భూ సమస్యలు పరిష్కరిస్తామని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి పేర్కొన్నారు. చందంపేట మండలంలోని రేకుల గడ్డ గ్రామంలో శనివారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆర్డీవో మాట్లాడారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీధర్‌బాబు, మాజీ సర్పంచులు ఎడ్ల అంజయ్య, మకట్‌లాల్, సోమాణి, రమేష్‌నాయక్, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సీపీఎస్ అమలుతో ఉద్యోగులకు నష్టం



చెన్నాయిపాలెం హైస్కూల్‌లో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

త్రిపురారం : కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్) అమలుతో ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాతోతు దశరథ నాయక్ అన్నారు. సీపీఎస్‌ను వ్యతిరేకిస్తూ శనివారం త్రిపురారం మండలం చెన్నాయిపాలెం జెడ్పీహెచ్‌ఎస్‌లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయుతో కలిసి నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దశరథ నాయక్ మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సైదిరెడ్డి, సత్యనారాయణ, సైదయ్య, నరసింహస్వామి, లక్ష్మి, శ్రీనివాస్, నరేందర్, ఝాన్సీ, లలిత, నీలిమా, తిరుపతమ్మ, విజయలక్ష్మి, రాము, సరస్వతి పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలని వినతి

కొండమల్లేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ అమలు పరచాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టిపియూఎస్) జిల్లా ఉపాధ్యక్షుడు కట్టెబోయిన శ్రీనివాస్‌యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. తపస్ నిరసన కార్యక్రమాల్లో భాగంగా శనివారం కొండమల్లేపల్లి తహసీల్దార్ నరేందర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొమిరె సైదులు, బద్దెల అంజయ్య, బొమ్ము రవి, మందడి శ్రీకాంత్ రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్రంపోడు : సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ శనివారం మండలకేంద్రంలో తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుగు శ్రీరామ్ మాట్లాడారు. జీఓ నెంబర్ 28 ద్వారా సీపీఎస్ అమలైన ఆగస్టు 23వ తేదీని విద్రోహ దినంగా పాటిస్తున్నామని తెలిపారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇది చీకటి రోజు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు పల్లపు సైదయ్య, మండల ప్రధాన కార్యదర్శి రామలింగమ్మ, శంకర్, సృజన, వెంకటేష్, నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగాన్ని చదవాలి



మాట్లాడుతున్న డాక్టర్ ముువ్వ రామారావు

మిర్యాలగూడ టౌన్ : భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలను ప్రతి ఒక్క విద్యార్థి చదవాలని జన విజ్ఞాన వేదిక జాతీయ కన్వీనర్ డాక్టర్ మువ్వ రామారావు, తెలంగాణ విద్యా వికాస వేదిక కన్వీనర్ కస్తూరి ప్రభాకర్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో «భారత రాజ్యాంగం– శాస్త్రీయ దృక్పథం» అనే అంశంపై జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని, రాజ్యాంగంలో రాయబడి ఉందని, శాస్త్రీయ దృక్పథం లేని చదువు నిరార్థకమని, అనేక దేశాల రాజ్యాంగాలను పరిశీలించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం మహోన్నతమైందన్నారు. విద్యార్థులు పుస్తకపఠనంపై శ్రద్ధ వహించాలని, సోషల్ మీడియా రీల్స్ పిచ్చిలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి సుదర్శన్, కళాశాల ప్రిన్సిపల్ రేపాల శ్రీనివాస్, వేదిక నాయకులు కొండల్‌రెడ్డితో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

ద్రవరూప ఎరువులతో పంటకు ప్రయోజనం



అవగాహన కల్పిస్తున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

పెద్దవూర : ద్రవరూప ఎరువులతో పంటలకు 90శాతం ప్రయోజనం ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి(డీఏఓ) పాల్వాయి శ్రవణ్‌కుమార్ అన్నారు. శనివారం పెద్దవూరలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లు, ఈ–పాస్ యంత్రాల పనితీరు, ఎరువుల నిల్వను పరిశీలించారు. అక్కడే ఉన్న రైతులకు నానో ఎరువులపై అవగాహన కల్పించి మాట్లాడారు. అరలీటరు నానో డీఏపీ, యూరియా డబ్బాలు 50 కిలోల బస్తాతో సమానమని, ఎకరానికి అరలీటరు నానో డీఏపీ సరిపోతుందని అన్నారు. ద్రవరూపంలో పిచికారీ చేయడం వల్ల మొక్కకు నేరుగా పోషకాలు అందుతాయన్నారు. ఆధార్ కార్డు తీసుకువచ్చిన రైతులకే ఈ–పాస్ యంత్రాల ద్వారా కాంప్లెక్స్ ఎరువులను విక్రయించాలని సూచించారు. ఆయన వెంట ఏఓ పి.సందీప్‌కుమార్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, అధికారులు

మిర్యాలగూడ అర్బన్ : గణేష్ ఉత్సవాలను ప్రజలందరూ శాంతియుతంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సబ్‌కలెక్టర్ నారయణ్ అమిత్, డీఎస్పీ కె.రాజశేఖర్ రాజు అన్నారు. శనివారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఐఎంఏ బిల్డింగ్‌లో వివిధ మత పెద్దలకు నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని కులాలు, మతాలు కలిసిమెలసి జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వన్‌టౌన్, టూ టౌన్, రూరల్ సీఐలు మోతీరామ్, సోమనర్సయ్య, పీఎస్‌డీ.ప్రసాద్, ఎస్‌ఐలు సైదిరెడ్డి, రాంబాబు, హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

హాలియా : గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ సతీష్‌రెడ్డి, ఎస్‌ఐ సాయి ప్రశాంత్ అన్నారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండపాల కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్‌ఐ వీరశేఖర్ అన్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉత్సవాల నిర్వాహకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి(చింతపల్లి) : నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని చింతపల్లి ఎస్‌ఐ ముత్యాల రామ్మూర్తి తెలిపారు. శనివారం చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన శాంతి సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనల మేరకు మండపాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

11 మంది బైండోవర్

గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ముందస్తుగా శనివారం 11 మంది డీజే సౌండ్ నిర్వాహకులను తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు చింతపల్లి ఎస్‌ఐ ముత్యాల రామ్మూర్తి పేర్కొన్నారు.

అడవిదేవులపల్లి : గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని అడవిదేవులపల్లి తహసీల్దార్ రాగ్యానాయక్ అన్నారు. శనివారం అడవిదేవులపల్లి తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో ఎస్‌ఐ శేఖర్, నాయకులు పాల్గొన్నారు.

డిండి: నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని డిండి రూరల్ సీఐ బీసన్న ప్రజలకు సూచించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అవాంచనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్‌ఐ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ సురవరం మృతికి సంతాపం



దేవరకొండలో సుధాకర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దేవరకొండ: సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ నాయకులు దేప సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం దేవరకొండ పట్టణంలోని బస్టాండ్ వద్ద సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సురవరం సుధాకర్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూనె రామస్వామి, పల్లా రంగారెడ్డి, జూలూరి వెంకట్రాములు, నీల వెంకటయ్య, కిన్నెర యాదయ్య, జూలూరు జ్యోతిబసు, మొయినొద్దీన్, మల్లయ్య, గోవర్ధన్, శ్రీను పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సంతాపం..

సీపీఐ అగ్రనాయకుడు, నల్లగొండ మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పట్ల దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ శనివారం ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. సురవరం సుధాకర్‌రెడ్డి నల్లగొండ పార్లమెంట్ సభ్యునిగా రెండు పర్యాయాలు ఎన్నికై ప్రజల్లో చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. నిబద్ధత గల నాయకుడిగా దేశ రాజకీయాల్లో సైతం ఆయన గుర్తింపు పొందారని కొనియాడారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

మిర్యాలగూడ అర్బన్ : సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మృతి ఆ పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సురవరం సుధాకర్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి జిల్లా యాదగిరి, నాయకులు పోలేపల్లి ఉదయ్‌కుమార్, ధీరావత్ లింగానాయక్, ఎర్రబోతు పద్మ, డి.శాంతి, బంటు రాజేశ్వరి, సులోచన, శ్రీనివాసరెడ్డి, పరమేష్, రవినాయక్ పాల్గొన్నారు.

డిండి: సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మృతికి శనివారం డిండి మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నాయకులు నివాళులర్పించారు. వామపక్ష, ప్రజాస్వామ్య ఉద్యమాలకు సుధాకర్‌రెడ్డి మృతి తీరని లోటని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చక్రి, సాగర్, నవీన్, మహేష్, వినయ్, శ్రీను, జంగయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మెడికల్ షాపులో చోరీకి యత్నం

మిర్యాలగూడ అర్బన్: మెడికల్ షాపులో గుర్తుతెలియని వ్యక్తి చోరీకి యత్నించాడు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌లో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశ్‌నగర్‌లోని ఓ మెడికల్ షాపులో ఈ నెల 12న గుర్తుతెలియని వ్యక్తి చొరబడి కౌంటర్‌లో ఉన్న రూ.2,500 నగదు చోరీ చేసి పారిపోయాడు. ఈ విషయం షాపు యజమాని స్థానికులకు చెప్పడంతో వారు అప్రమత్తమయ్యారు. శనివారం మధ్యాహ్నం అదే మెడికల్ షాపు యజమాని దుకాణం మూసివేసి భోజనానికి వెళ్లాడు. ఇది గమనించిన సదరు దొంగ షట్టర్ వద్ద ఫోన్ మాట్లాడుతున్నట్లు నటించి ఎవరూ చూడటంలేదని అనుకుని షట్టర్ లేపి షాపు లోపలికి వెళ్లాడు. స్థానికులు గమనించి షట్టర్ మొత్తం మూసివేసి షాపు యజమానికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. అతడు వచ్చి షట్టర్ తెరిచి చూడగా లోపల ఉన్న మరో తలుపు తెరుచుకుని వెనుక నుంచి దొంగ గోడ దూకి పారిపోయినట్లు గుర్తించారు. ఈ తంతంగమంతా షాపు పక్కన ఉన్న మరో వ్యక్తి తన సెల్‌ఫోన్‌లో వీడియో తీయడంతో నిందుతుడి వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదని తెలిసింది.

ఒక్కో రైతుకు రెండు బస్తాల యూరియా

కొండమల్లేపల్లి : యూరియా కోసం రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం వద్ద ఉదయం నుంచి యూరియా లోడ్‌తో లారీ వస్తుందన్న సమాచారం మేరకు అక్కడి చేరుకున్న రైతులు గంటల తరబడి వేచి చూశారు. తీరా ఒక లారీ లోడ్‌తో 446 బస్తాల యూరియా రావడంతో స్థానిక ఏవో జానకిరాములు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసుల పర్యవేక్షణతో ఒక్కో రైతుకు రెండేసి బస్తాల యూరియా ఇవ్వగా మరికొంత మంది రైతులకు యూరియా బస్తాలు అందకపోవడంతో నిరాశగా వెనుదిరిగారని ఏవో తెలిపారు.

విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ

వేములపల్లి : మండలంలోని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు శనివారం దాత పి.సందీప్ సహకారంతో రూ.6వేలతో అందించిన టై, బెల్టులను ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సందీప్ కృషి అభినందనీయమన్నారు. దాతలు మరింతగా ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ ఎంతో అవసరం

హాలియా : విద్యార్థులకు క్రమశిక్షణ చాలా అవసరమని హాలియా ఎస్‌ఐ సాయిప్రశాంత్ అన్నారు. శనివారం హాలియా పట్టణంలోని లక్ష్య స్కూల్‌లో హరిత క్లబ్‌లకు ఎన్నికైన విద్యార్థులచే నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం పాఠశాలలో వివిధ గ్రూప్‌ల లీడర్లచే ప్రమాణస్వీకారం చేయించి మాట్లాడారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాఠశాల చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, పాఠశాల డైరెక్టర్లు సతీష్, భాస్కర్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరి, పత్తి పంటల పరిశీలన

తిరుమలగిరి(నాగార్జునసాగర్): కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్‌కు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం శనివారం మండలంలోని రాజవరం గ్రామంలో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా కేవీకే కంపాసాగర్ ప్రిన్సిపాల్, సైంటిస్ట్ డాక్టర్ లింగయ్య, సీనియర్ సైంటిస్ట్ శ్రీధర్, సస్యరక్షణ శాస్త్రవేత్త రాములమ్మ రైతులకు పలు సూచనలుచేశారు. వీరి వెంట ఏఓ హర్షిత ఉన్నారు.

అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

మాడుగులపల్లి : మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు బాధ్యాతయుతంగా పనిచేయాలని మండల ప్రత్యేకాధికారి డి.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎంపీడీఓ సంగీత, ఏఓ శివరాంకుమార్, వెటర్నరీ డాక్టర్ వినయ్‌కుమార్, పీహెచ్‌సీ డాక్టర్ సత్యనారాయణ, హౌసింగ్ ఏఈ జ్యోతి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడ : మండలంలోని తిమ్మాపురం గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. తమ గ్రామంలో వీధి దీపాలు లేక రాత్రి సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేధన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామంలో పాలన వ్యవస్థ కరువు కావడంతో సమస్యలను పట్టించుకునే నాదుడే కరువయ్యారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారుల స్పందించి తమ గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆదర్శ పాఠశాలలో వన మహోత్సవం

డిండి: డిండిలోని ఆదర్శ పాఠశాలలో శనివారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బిచ్చయ్య, వైస్ ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.